ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024



ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

- రూ.2 లక్షలా 70 వేల నగదు సీజ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి పాడేరు వంతాడపల్లి చెక్పోస్ట్ వద్ద పోలీస్ తనిఖీలు నిర్వహించారు. 50 వేలకు మించి నగదు తో ప్రయాణిస్తున్న వ్యక్తులను తనిఖీలు చేసి వారి నుంచి నగదు స్వాధీనపరచుకొని సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు మైదాన ప్రాంతం నుండి పాడేరుకు ద్విచక్ర వాహనం లో సరైన పత్రాలు లేకుండా 2,70,000 నగదు తో వస్తుండగా పోలీస్ తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి ఈ సొమ్మును స్వాధీనం పరుచుకుని సీజ్ చేశారు.



కారులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కూటమి శ్రేణుల్లో వీడని ఉత్కంఠ

- అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో పునరాలోచన !
- రోజురోజుకూ మారుతున్న ఊహాగానాలు

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి జిల్లాలోని అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ స్థానాలకు టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ వీడటం లేదు. రోజురోజుకూ ఇక్కడ రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. అరకు పార్లమెంట్ స్థానానికి బిజెపి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత పేరు ప్రచారంలో ఉంది. అయితే ఇప్పటివరకు గీత పేరును ఖరారు చేస్తూ అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు పాడేరు అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న గిడ్డి ఈశ్వరి పేరు ఇప్పటికీ ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి నేతల వ్యూహం అంతుచిక్కడం లేదు. పాడేరు అసెంబ్లీ స్థానానికి అభ్యర్థి పేరు ఖరారుపై తీవ్ర తాత్సారం సాగుతోంది.

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఈ సీటు ఖరారు అవుతుందని అంతా భావించారు. అయితే అనూహ్యంగా నియోజవర్గంలోని టిడిపి నాయకులు కొట్టగుల్లి సుబ్బారావు, కిల్లు రమేష్ నాయుడు, ఎంవివి ప్రసాద్ ఈ ముగ్గురు పాడేరు టిడిపి టికెట్ తమకే దక్కుతుందని ఆశాభావంతో ఇప్పటికే నియోజవర్గంలో జోరుగా ప్రచార పర్వం మొదలు పెట్టారు. గత నెల రోజులుగా వీరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా మరోవైపు పాడేరు అసెంబ్లీ సీటును బిజెపికి కేటాయిస్తున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అరుకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా కూటమిలోని బిజెపికి దక్కలేదు. దీంతో పాడేరు అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని బిజెపి పార్టీ శ్రేణులు పట్టు పడుతున్నట్లు తెలుస్తోంది.

పాడేరు బిజెపి అభ్యర్థులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు కురస ఉమామహేశ్వరరావు, కూడా కష్ణారావుతో పాటు కీర్తిశేషులు కురసా బొజ్జయ్య సోదరి పార్వతమ్మ పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతల్లో ఐక్యత లోపం, ఆశావహుల సంఖ్య పెరగడం, సీటు తమకే కేటాయించాలని అధిష్టానం పై వీరంతా తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం ఈ కూటమి పార్టీల్లో టిడిపి నే బలంగా ఉంది. బిజెపి జనసేన పార్టీలకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేడర్ చాలా తక్కువ గా ఉంది. ఈ కారణంగా టిడిపికే పాడేరు టిక్కెట్ కేటాయించాలని ఆ పార్టీ శ్రేణులు అధిష్టానం పై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. పైగా 1999 ఎన్నికల తర్వాత నుంచి టిడిపి ఈ నియోజకవర్గంలో ఒక్కసారి కూడా గెలవలేక పోయింది. ఈసారి సానుకూల పరిస్థితులు ఉన్నాయని పాడేరు సీటు కోసం ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

బిజెపి పట్ల తీవ్ర వ్యతిరేకత

అల్లూరి జిల్లా అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో భారతీయ జనతా పార్టీ పట్ల ఆదివాసీల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్త మౌతోంది. మోడీ పాలనలోని కేంద్ర ప్రభుత్వం హయాంలో అల్లూరి జిల్లా మన్య ప్రాంతంలో అభివృద్ధి కుంటుపడిందని పలువురు గిరిజనులు అసంతృప్తితో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమానికి కూడా ఆదివాసి లో స్పందన కాన రాకపోవడం ఇందుకు నిదర్శనం. అలాగే గిరిజనులకు ఎంతో ప్రయోజనంగా ఉన్న అటవీ చట్టాల సవరణ జీవో 3 రిజర్వేషన్ రద్దు చేయడం వంటి ఎన్నో గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆదివాసి గిరిజనులు చాలా గుర్రుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజనులు పోరు బాట పట్టారు. మరోవైపు గిరిజనులు వ్యతిరేకిస్తున్న ఈ బీజేపీ పార్టీ అభ్యర్థిగా అరకు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారనుకుంటున్న మాజీ ఎంపీ కొత్తపల్లి గీత పట్ల కూడా గిరిజనులు విముఖంగానే ఉన్నారు. కొత్తపల్లి గీత ఎస్టి కాదని ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే నియోజకవర్గ బిజెపి పార్టీ శ్రేణులు కూడా గీత అభ్యర్థిత్వం పట్ల బాహటంగానే వ్యతిరేకిస్తున్నారు. సీట్ల విషయంలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని అదిష్టానాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఈ ప్రతికూల పరిస్థితుల కారణంగా అభ్యర్థుల ఎంపిక తో పాటు పొత్తులతో సీట్లు కేటాయింపులో కూడా ఎదురవుతున్న చిక్కులపై కూటమి నేతలు కొత్త వ్యూహ రచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించడంతో అరుకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ స్థానాలకు కూటమి నేతలు కొత్త వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ముఖాలను బరిలోకి తెచ్చి ఈ స్థానాల్లో ప్రస్తుతం నెలకొన్న అసమ్మతి అసంతృప్తి వ్యతిరేక పరిస్థితులను చక్కభరచాలని కూటమి నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



గిడ్డి ఈశ్వరికి మద్దతుగా ర్యాలీ చేపడుతున్న నాయకులు (ఫైల్)



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సురేష్

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి
సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-చింతూరు

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభించాయని, అసెంబ్లీ, పార్లమెంట్లో సిపిఎం ప్రజా ప్రతినిధులుంటేనే వారికి న్యాయం జరుగుతుందని, అందువల్ల రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎజి.కోడేరు గ్రామపంచాయతీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మల్లెతోట గ్రామంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు చట్ట ప్రకారంగా పరిహారం, పునరావాసం, ప్యాకేజీలు నేటికీ కల్పించడం లేదన్నారు. 2006లో ప్రాజెక్టు ప్రారంభం కాగా నాటి నుండి ఏడాదికి ఏడాది ప్రజలు ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారే తప్పా వారికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రూ.1,15,000 ఇచ్చిన రైతులకు రూ.5 లక్షలు ఇస్తామని జగన్మోహన్రెడ్డి చేసిన వాగ్దానం ఐదేళ్లు పూర్తయిన అమలు కాలేదన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా, ఈ ప్రాంతం గిరిజన, గిరిజనేతర ప్రజల సమస్యలపైనా నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. మల్లెతోట గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం నాగేష్, ధర్మల మల్లయ్య, ధర్మల వీరభద్రం, కూర సుబ్బారావు, ధర్మల పోద్దయ్య, ధర్మల బుజ్జి, మడకం సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

- -సభలు, ర్యాలీలు, అనుమతులు పొందండి
- -కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు,:- ఈ నెల 16వ తేదీ నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వ్యక్తిగత దూషణలకు, మతపరమైన కార్యకలాపాలకు దూరంగా వుండాలని సూచించారు. బహిరంగ సమావేశాలకు సింగల్ విండో ద్వారా అనుమతులు పొందాలన్నారు. అన్ని ప్రదేశాలలో వీడియో చిత్రీకరణ జరుగుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలలో పునరావాస చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. బహిరంగ సమావేశాలు, ర్యాలీలు జరిపినప్పుడు స్థానిక పోలీసులకు లొకేషన్, సమయం తెలియజేస్తూ అనుమతులు పొందాలన్నారు. అటువంటి సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే విధులు నిర్వర్తించ రాదనీ తెలిపారు. ఎన్నికల ప్రచారానికి మతపరమైన కేంద్రాలు వినియోగించరాదన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో పత్రాలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, లేకుంటే తిరస్కరణకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. అవసరమైతే అక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సహాయం తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటన మేరకు ఏప్రిల్ 18 నుండి 25 వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29 వరకు విత్ డ్రాయల్, మే 13 న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయన్నారు. పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులు రూ.25 వేలు, శాశన సభకు పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు అందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. ఎంపి అభ్యర్థులు ఫారం 2ఎ, ఎంఎల్ఎ అభ్యర్థులు ఫారం -2బి లలో నామినేషన్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నారు.

అనంతరం ఎంసిసి, సి విజిల్, ఎంసిఎంసి గురించి, నామినేషన్ గురించి, సువిధ యాప్ గురించి కలెక్టర్, సంబంధిత అధికారులు వివరించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ బి. పద్మావతి, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.అంబేద్కర్, ట్రాన్స్పోర్ట్ అధికారి లీలా ప్రసాద్, ఆర్అండ్బి ఇఇ బాలసుందర బాబు, డ్వామా పిడి ఎం.శివయ్య, మీడియా నోడల్ అధికారి పి. గోవింద రాజులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



ప్రైవేటు ఎటిఎం ఆపరేటర్లతో సమావేశమైన తహశీల్దారు ఫాజిల్

గిరిజనులను మోసం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో ప్రైవేటు ఎటిఎం ఆపరేటర్స్ అమాయక గిరిజనులను మోసం చేసినట్లు తేలిస్తే కఠిన చర్యలు తప్పవని మండల తహశీల్దార్ ఎస్.డి.మౌలానా ఫాజిల్ హెచ్చరించారు. ఈ మేరకు ప్రైవేటు మినీ ఎటిఎం యజమానులతో గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం తహశీల్దార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, రైతులు తమ అవసరాల కోసం డెబిట్ కార్డులతో డబ్బులు విత్ డ్రా చేయడానికి వచ్చే సమయంలో, వారిని మోసం చేసి ఎక్కువ నగదు విత్ డ్రా చేసి మోసం చేయవద్దని హితవుపలికారు. ఈ సమావేశంలో ఆర్ఐ మడకం రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, మినీ ఎటియం యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్ర

సిపిఎంను బలపరచండి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రజల పక్షాన ఉంటూ సమస్యలపై పోరాడే సిపిఎం బలపరిచిన అరకు పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో. సురేంద్ర పిలుపునిచ్చారు.గురువారం అనంతగిరి మండల సిపిఎం కార్యకర్తల విస్తతస్థాయి సమావేశం గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశాం సీపీఎం టోకురు సర్పంచ్ కిల్లో మొస్య అద్యక్షతన జరిగింది ఈ సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలు రక్షణకై నిరంతరం పని చేస్తున్న సిపిఎం అభ్యర్థులకే ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. సాగు లో ఉన్న రైతులకు పోడు భూమి పట్టాలు పంపిణీ చేయాలని అనేక అనేక పోరాటాలు చేసి సాధించడం జరిగిందన్నారు. మంచినీరు, రోడ్డు గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి విభజించు పాలి పాలించు అనే రీతిలో బిజెపి ప్రభుత్వం దేశంలో పాలిస్తుందనానరు. బిజెపితో భవిష్యత్తులో ముప్పు ఉందని విమర్శించారు. సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు మాట్లాడుతూ, గ్రామాలలో రోడ్లు, తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారనికి కృషి చేస్తున్నానన్నారు. పాడేరు కనెక్టివిటీ కింద మండలంలోని రాజుపాక నుండి డెక్కపురం, చీడివలస నుండి బొంగిజా, మెట్టువలస నుండి ఒనుకొండ, గుమ్మ నుండి కడారేవు, జెండా గరువు నుండి ఊటగెడ్డ, బొడ్డపాడు నుండి పుట్టపాడు మరికొన్ని గ్రామాల రోడ్లకు 2 కోట్ల 50 లక్షల నుండి మూడు కోట్లు నిదులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, కార్యకర్తలు దేవన్న, సింగులు, కృష్ణ, దేవుడమ్మ, కాసులమ్మ, దేవి, అనకాపల్లి జిల్లా నాన్ షెడ్యూల్ పంచాయతీ గిరిజన సంఘం కార్యదర్శి వైకె దొర, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

నాంది ఫౌండేషన్ బృందం పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని గురగరువు గ్రామాన్ని నాంది ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం సందర్శించారు. బెస్ట్ విలేజ్ బెస్ట్ ఫార్మర్ ఎంపికలో భాగంగా పరిశీలనకు ఈ నాంది ప్రతినిధి బృందం ఈ గ్రామంలో పర్యటించింది. ఈ గ్రామానికి చెందిన గిరిజన కాఫీ రైతుల సంఘం జాతీయ సభ్యుడు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు పాలికి లక్కు నాంది ప్రతినిధులకు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో కాఫీ సాగు చేపడుతున్న సాగు విస్తీర్ణం, దిగుబడి, తదితర విషయాలను లక్కు వారికి వివరించారు.



స్వాగతం పలుకుతున్న లక్కు

హక్కుల సాధనకు ఐక్య పోరాటమే శరణ్యం

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సబ్బరావమ్మ అన్నారు. రంపచోడవరంలో గురువారం జరిగిన యూనియన్ సమావేశంలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేస్తామని వికసిత్ భారత్ అంటూ ఊదగొట్టే ప్రచారం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పదేళ్లలో ఏమి అభివృద్ధి చేసింది? ఏమి వికసించింది? రానున్న ఎన్నికల్లో విజయం సాధించి ఏమి వికసింపజేస్తుందని ప్రశ్నించారు. జీవో నెంబర్ 3ను రద్దు చేసి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందన్నారు. అటువంటి బిజెపిని, దానికి మద్దతు తెలుపుతున్న తెలుగుదేశం, జనసేన, వైఎస్ఆర్సిపిలను 2024 ఎన్నికలలో ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా అంగన్వాడీలు ఎన్నో పోరాటాలు, సమ్మెలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం, రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు నిరవధిక సమ్మె చేయడంతో దిగొచ్చిందని తెలిపారు. సమ్మె సమయంలో ఎన్నో విధాలుగా ప్రభుత్వం అడ్డంకులు కల్పించినా, ఎస్మాను ప్రయోగించి ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించినా, అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చేత తెరిపించినా ఎక్కడా వెరవకుండా పోరాటాన్ని కొనసాగించడంతో ప్రభుత్వం తలవంచక తప్పలేదని గుర్తు చేశారు. సమ్మె విజయవంతం కావడంతో 11 హక్కులను సాధించుకోగా, అందులో సుమారు 6 హక్కులకు జీవోలు కూడా విడుదల కాపడ్డాయని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న ఈ హక్కులు అంగన్వాడీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎంతో తోడ్పడతాయని చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ

పాఠశాలలకు సక్రమంగా బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని వివిధ పాఠశాలలకు మిడ్డేమీల్స్ నిర్వహణకు రేషన్ బియ్యం ఎప్పటికప్పుడు సక్రమంగా అందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిసిసి రంపచోడవరం డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు తెలిపారు. మారేడుమిల్లి జిసిసి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని కొన్ని పాఠశాలలకు మధ్యాహ్నం భోజనం పథకానికి రేషన్ బియ్యం సరిగా రావడం లేదని సంబంధిత అధికారులు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే స్పందించి ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐటిడిఎ పిఒ ఆదేశాలతో దీనిపై గురువారం మారేడుమిల్లి సివిల్ సప్లై డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి మిడ్డేమీల్స్కు సంబంధించిన రేషన్ బియ్యం వివరాలను తెలుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శ్యాం కుమార్, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, డిప్యూటీ తహశీల్దారు బాలాజీ, మారేడుమిల్లి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకటరాజారెడ్డి, జిసిసి గొడౌన్ సూరింటెండెంట్ అక్కిరెడ్డి, జిసిసి సేల్స్ మెన్స్, డీలర్లు పాల్గొన్నారు.



జిసిసి డీలర్లతో మాట్లాడుతున్న డివిజనల్ మేనేజర్ జి పార్వతీశ్వరరావు

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు

స్థానిక కస్తూరాబాయి గాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 12 నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక కెజిబివి ప్రిన్సిపాల్ ఎ.పరిమిళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపిసి ప్రథమ సంవత్సరానికి 40 సీట్లు ఖాళీ భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కొయ్యూరు కెజిబివిలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పరిమిళ కోరారు.



టిడిపి శ్రేణులు నిరుత్సాహ పడొద్దు

ప్రజాశక్తి -కొయ్యూరు : తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, పాడేరు టికెట్ విషయంపై టీడీపీ అధిష్టానం పునరాలోచన చేస్తుందన్న నమ్మకం తనకుందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. పొత్తుల కారణంగా టికెట్ కేటాయించలేదని పార్టీ శ్రేణులు అసంతృప్తితో ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అధిష్టానం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు చెప్పారు. పాడేరు టికెట్ మాజీ ఎమ్మెల్యే గడ్డి ఈశ్వరికి ఖరారు చేస్తున్నట్లు టిడిపి మండల నాయకులు గొలుసుంగి సత్యనారాయణ తెలిపారు.



డౌనూరు పిహెచ్సి ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న ఫీడర్ అంబులెన్స్ ఇదే

నిరుపయోగంగా ఫీడర్ అంబులెన్స్

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని డౌనూరు పీహెచ్సీ పరిధిలో ఉన్న ఫీడర్ అంబులెన్స్ నెలల తరబడి నిరుపయోగంగా ఉంది. మారుమూల గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన రోగులను ఆసుపత్రికి తరలించేందుకు ఫీడర్ అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అయితే ఈ వాహనం మరమ్మతులకు గురై నెలల తరబడి గిరిజన రోగులకు అందుబాటులో లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫీడర్ అంబులెన్స్కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గ్రామాల రోడ్లలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కుందులూరు, గుల్లేటివాడ, కారం గూడెం, తెల్లంవారి గూడెం, మొద్దుల గూడెం క్రాస్ రోడ్డు నుండి తోటపల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డు ఛిద్రమై వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. పోచవరం గ్రామానికి వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో నిత్యావసరాలు తెచ్చుకోవడానికి, ఆసుపత్రికి వెళ్లడానికి, వివిధ పనులపై మండల కేంద్రానికి వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ రహదారులకు కనీసం మరమ్మతులైనా చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, గిరిజనులు కోరుతున్నారు.



శిథిలమై గోతులు ఉన్న రహదారి

నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు!

- రెండు నెలలుగా మూలకు చేరిన నీటి మోటారు
- మరమ్మతులకు ముఖం చాటేసిన అధికారులు
- ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల అవస్థలు


తలుపులు మూసేసి, కర్రలను అడ్డంగా పెట్టి మూసేసిన మరుగుదొడ్లు

ప్రజాశక్తి రంపచోడవరం : ఆర్‌టిసి అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతో ప్రయాణికులకు నానా అవస్థలకు గురిచేస్తోంది. రంపచోడవరం బస్‌కాంప్లెక్స్‌లో నీరు సరఫరా చేసే మోటారు పాడై రెండునెలలు గడిచినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లు మూలకు చేరాయి. దీంతో స్థానిక ప్రయాణికులతోపాటు దూరప్రాంతాల నుంచి వచ్చేవారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు. అయినా ఆర్‌టిసి అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీటి కోసం బయట నుంచి బాటిళ్లతో నీరు తెప్పించి, నిధులు దుబారా చేస్తున్న అధికారులు పాడైన మోటారును బాగుచేయించాలన్న ధ్యాస లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు మండిపడుతున్నారు.

దూరప్రాంత ప్రయాణికుల ఇక్కట్లు

రంపచోడవరం డివిజన్ కేంద్రంలోని ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్‌లోనీటి మోటారు రెండు నెలల క్రితమే పాడైంది.దీంతో నీటి సరఫరా నిలిచి మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రాజమండ్రి, కాకినాడ, రాజోలు, రావులపాలెం తదితర డిపోల నుండి ఆర్‌టిసి బస్సులు భద్రాచలం, అటుగా హైదరాబాదు ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే రంపచోడవరం మీదుగా వెళ్లాల్సిందే. రంపచోడవరం దాటితే అటూఇటూ సుమారు 70 కిలోమీటర్ల వరకు మరుగుదొడ్డి సౌకర్యం ఉన్న ఆర్‌టిసి బస్‌స్టాండ్ లేదు. దీంతో దూరప్రాంత ప్రయాణికులు కాలకృత్యాలు, మలమూత్ర విసర్జన వంటి పనులను రంపచోడవరంలోనే ముగించుకుని బయలుదేరుతుంటారు.

అయితే రెండు నెలలుగా నీటిసౌకర్యం లేక మరుగుదొడ్లను మూసేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


ఆటోలో బాటిళ్లలో నీరు తెప్పించిన నిర్వాహకులు

అంతేకాక నియోజకవర్గ కేంద్రం కావడంతో నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుండి పలు సమస్యలపై ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. వారు సైతం మరుగుదొడ్లు అందుబాటులో లేక అవస్థలు పడే పరిస్థితి ఉంది.

బాటిళ్లతో నీరు తెప్పించినా తీరని సమస్య

మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు పడే ఇబ్బందులను గమనించిన మరుగుదొడ్ల నిర్వాహకులు ఆటోలో బాటిళ్లతో నీరు తెప్పించి, కొన్నాళ్ల ప్రయాణికుల అవసరాలను తీర్చే ప్రయత్నం చేశారు. అయితే దీనికయ్యే ఖర్చు తడిసి మోపెడవ్వడంతోపాటు అరకొర నీటితో మరుగుదొడ్లతో పరిశుభ్రత కొరవడడంతో కొందరు ప్రయాణికులతో గొడవ పడే పరిస్థితి వచ్చింది. దీంతో మనకెందుకులే అనకుని, మరుగుదొడ్లను మూసేసి, అత్యవసరమైతే ఎవరైనా లోపలికి వెళ్లిపోతారేమోననుకుని కర్రలను అడ్డంగా పెట్టేశారు.

పరిశీలించి వెళ్లారంతే..

రంపచోడవరం బస్‌కాంప్లెక్స్‌లో నీటి సమస్యపై పాడేరు డిపో అధికారులకు ఫిర్యాదు అందడంతో ఆర్‌టిసి విజిలెన్స్ యంత్రాంగం ఒకసారి వచ్చి సమస్యను పరిశీలించి నమోదు చేసుకుని వెళ్లారని, తర్వాత ఎటువంటి స్పందన లేదని స్థానికులు అంటున్నారు.

పాడేరు డిపో పరిధిలోకి నిర్వహణ వెళ్లాకే ఈ పరిస్థితి

రంపచోడవరం ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్ నిర్వహణ గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గోకవరం ఆర్‌టిసి డిపో పరిధిలో ఉండేది. అప్పట్లో ఏదైనా సమస్య తలెత్తితే సమాచారం అందిన ఒకటి, రెండు రోజుల్లోనే పరిష్కరించే పరిస్థితి ఉండేదని స్థానికులు అంటున్నారు. జిల్లాల విభజన తర్వాత రంపచోడవరం పాడేరు ఆర్‌టిసి డిపో పరిధిలోకి వచ్చాకే ఇక్కడ సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని అంటున్నారు. పాడేరు నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో రంపచోడవరం ఉండడం కూడా, ఇక్కడ సమస్యలపై దృష్టిపెట్టే వీలు లేకుండా పోయిందనే వాదన ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌టిసి యంత్రాంగం స్పందించి, రంపచోడవరం బస్‌కాంప్లెక్స్‌లో పాడైన నీటిమోటారును బాగుచేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించడం ద్వారా మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికలు పూర్తయ్యే వరకూ 'స్పందన' రద్దు

ప్రజాశక్తి - పాడేరు : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయసునీత గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరగదని చెప్పారు. అర్జీదారులు శుక్రవారం వినతులు సమర్పించడానికి ఐటిడిఏ కార్యాలయానికి రావద్దని కోరారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత తిరిగి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ మార్పును అందరు గమనించాలని కోరారు.

రోడ్డుపై మురుగుతో అవస్థలు

- సిసి రోడ్డు నిర్మించినా డ్రైనేజీ ఏర్పాటులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అరకులోయ: మండల కేంద్రానికి సమీపంలో చొంపి గ్రామ గిరిజనులు మురుగుతో అవస్థలు పడుతున్నారు. సిసి రోడ్లు వేసినప్పటికీ, ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో కుళాయిల వద్ద వాడికనీరు, గ్రామస్తులు వాడిన మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై అధికారులకు పదేపదే మొర పెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు .ఈ సమస్యపై అల్లూరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆ గ్రామ గిరిజనులు తెలిపారు.


డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

పూటకో పంచన.. రోజుకో వరండాలో...


వరండాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

- గొర్రిలోవలో చదువుకు గిరిజన విద్యార్థుల అగచాట్లు
- ఏళ్లతరబడి వసతికి నోచుకోని ప్రభుత్వ పాఠశాల
- నాడునేడు నిధులతోనూ అసంపూర్తిగానే నిర్మాణం
- హామీలే తప్ప, పట్టించుకోని అధికారులు, నేతలు

గిరిజన విద్యకు పెద్దపీట వేస్తున్నాం.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతి, సౌకర్యాలకు కోట్లు వెచ్చిస్తున్నామన్న పాలకులు, అధికారుల మాటలకు, చేతలకు పొంతన లేదని గొర్రిలోవ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటైన నాటినుంచి నేటివరకు ఇతర సౌకర్యాలను పక్కనపెడితే, నేటికీ వసతి కల్పించలేదని ఆవేదన చెందుతున్నారు. నాడునేడు నిధులతో నిర్మించిన భవనం అసంపూర్తిగానే ఉండిపోయిందంటున్నారు. దీంతో రోజుకో పంచన, పూటకో వరండాలో చదువుకోవాల్సిన దుస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అయినా అధికారులు, నేతలెవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.


నాడు నేడు నిధులతో అసంపూర్తిగా గొర్రిలోవ పాఠశాల భవనం

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ గొర్రిలోవ పాఠశాలకు ఏళ్లతరబడి సొంత భవనం లేని దుస్థితి ఉంది. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులెందరు మారినా, పథకాలెన్ని వచ్చినా తమ గ్రామ పాఠశాలకు వసతి కల్పించే దిక్కులేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో గ్రామంలో ఒక గిరిజన రైతు ఇంటి వరండాలో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన చేయించాల్సిన దుస్థితి నెలకొంది. అదికూడా ఇరుకుగా ఉండడంతో పుస్తకాల సంచులన్నీ ఆరుబయట వదిలేసి, విద్యార్థులంతా దాదాపు ఒకరిపై మరొకరు కూర్చొన్నారా అన్నట్లు ఉండి చదువు కొనసాగిస్తున్నారని స్థానికులు, తల్లిదండ్రులు అంటున్నారు.

అధికారులకు చెప్పినా స్పందన లేదు...

దీనిపై అధికారులు, నేతలకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా కనీస స్పందన లేదని ఆందోళన చెందుతున్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్‌లకు అనేకసార్లు విన్నవించినా ఎందుకు స్పందిచడం లేదో అంతుపట్టడం లేదని వాపోతున్నారు. నాడునేడు నిధులతో పాఠశాలకు భవనం మంజూరైనా, పనులు ప్రారంభించి, పూర్తి చేయకుండానే అసంపూర్తిగా వదిలేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనులు పున:ప్రారంభానికి చర్యలు చేపడితే, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం జూన్‌నాటికైనా భవనం పూర్తయి వినియోగంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా ఎండకాసినా, వర్షం కురిసినా పరాయి ఇంటి వరండాలో బిక్కుబిక్కుమంటూ కూర్చుని గడపాల్సిన దయనీయ పరిస్థితుల నుంచి తమను గట్టెక్కించాలని గిరిబాలలు, వారి తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు

ఓటు యువత చేతిలో ఆయుధం



యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : యువతరం తమ భవిష్యత్తును, దేశ ప్రగతికి సంబంధించిన ఆకాంక్షలను నిర్దేశించాలంటే ఓటు హక్కును ఉపయోగించుకోవాలని, ముఖ్యంగా ఓటు అనే ఆయుధాన్ని బాధ్యతతో రానున్న ఎన్నికలలో వినియోగించుకోవాలని గీతం అధ్యక్షుడు ఎమ్. శ్రీభరత్ పిలుపునిచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య అనుబంధ విభాగం యంగ్ ఇండియన్స్ గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, విధిగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుగా యువత తమ వంతు బాధ్యతను గుర్తెరిగి తమ ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను అధికారంలోకి తీసుకురావాలని చెప్పారు. వివిధ కారణాలను చూపి ఓటు హక్కును వినియోగించుకోకపోవడం, ఓటింగ్‌కు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో, కేంద్రంలో చట్ట సభలు వాటికి గల అధికారాలను కొత్త ఓటర్లకు వివరించారు. 2024 సంవత్సరంలో యువత భాగస్వామ్యంతో ఎన్నికలు స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా జరగగలవన్న ఆకాంక్షను వ్యక్తం చేసారు. యంగ్ ఇండియన్స్ ప్రతినిధి ఉప్పలపాటి రాణా మాట్లాడుతూ దేశంలో అధిక శాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో సిఐఐ యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు సంజన, సుమీధ్, నివేధిత, ఆదర్ష్, రోహిత్, గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ప్రశాంతమైన వాతా వరణం కల్పించేందుకు అందురు సహకరించాలని గొలుగొండ ఎస్సై కృష్ణారావు, కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఏ రాజకీయ పార్టీ తరపున ప్రచారం చేయకూడదని చెప్పారు. ఇప్పటికే కొంతమంది పై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా గొడవలకు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడిన వెంటనే పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ఎవరు అతిక్రమించిన చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవన్నారు.

గీతంలో సాంకేతిక యువజనోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం (ఇఇసిఇ), ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్క్వేర్ ఆర్-2024 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ సైంటిస్ట్ - ఎఫ్ ఎన్ఎస్ఈఎల్ వివేక్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సమకాలీన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్. రాఘవచేతన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణిచంద్ర కుమార్, ఐ స్క్వేర్ ఆర్ కన్వీనర్ సెవెన్త్ లైన్, ఫ్యాకల్టీ సలహదారులు డాక్టర్ పి.రాజు, ఎన్‌విఎస్‌వి.విజయకుమార్, డాక్టర్ ఎస్.శారద రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ఇంజినీరింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నూతన సాంకేతక అంశాలపై వర్క్‌షాపుతో పాటు నిపుణుల ప్రసంగాలు, పేపర్ ప్రెజెంటేషన్, టెక్‌ఎక్స్‌పో, ఆర్‌ఎక్స్‌పో రోబోరేస్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్లు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ, వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో గురువారం ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకుని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వచ్చేనెల 15వరకు ఓటరుగా పేర్లు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని, ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకోవాలన్నారు. ఎపిఎం మంగ మాట్లాడుతూ, 85 ఏళునిండిన వృద్ధులందరికీ ఇంటి నుంచే ఓటు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలోఎంఆర్ఐ కొండబాబు, ఐకెపి సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు పోలీసుల భరోసా

ప్రజాశక్తి -చీడికాడ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు భరోసానిస్తూ కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ దిబ్బపాలెం, తునివలస, వరహాపురం, కోణాం, ఖండివరం, అప్పలరాజుపురం, బోయపాడు, జైతవరం గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఎటువంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎస్ఐ సూచించారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. గురువారం గ్రామంలోని కూలీలతో మాట్లాడుతూ, జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లోకి రావాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా కూలీలందరూ ఉదయాన్నే తొందరగా పనికి వెళ్లి, ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రభుత్వం కూలీకి నిర్దేశించిన రూ.272 వేతనాన్ని పొందే విధంగా పనులను చేయాలన్నారు. వేరే ప్రాంతాలకు కూలి పనికి వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో పాల్గొనడం ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతోపాటు వేతనాన్ని పొందడం ద్వారా స్వీయలబ్ధి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ డివి స్వామి పాల్గొన్నారు.

అసౌకర్యాలతో 'పది' విద్యార్థులకు పరీక్ష

- ఇరుకు గదుల్లో వసతితో నానా అగచాట్లు
- బెంచీల మధ్యే చదువు.. అక్కడే రాత్రి నిద్ర
- 53మందికి ఒకే ఒక మరుగుదొడ్డితో ఇక్కట్లు
- ఏర్పాట్లలో అధికారుల వైఫల్యంపై విమర్శలు


ఇరుకు తరగతి గదిలో బెంచీల మధ్య ఒకరిపై మరొకరు పడుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి- అరకులోయ : మండలంలోని కొత్త భల్లుగూడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల కేంద్రంలో టెన్త్ పరీక్షలు రాసేందుకు వచ్చిన లోతేరు, బస్కి పాఠశాలల విద్యార్థులు అసౌకర్యాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల నుంచి పరీక్ష కేంద్రానికి దూరం కావడంతో, వీరికి ఐటిడిఎ అధికారుల ఆదేశాల మేరకు కొత్త భల్లుగూడలో ఉండి పరీక్షలు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒ, ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరికి సౌకర్యవంతమైన వసతి, భోజనం, చదువుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, ఎటువంటి సౌకర్యాలు లేని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో వసతి కల్పించారు. ఈ కేంద్రంలో కొత్త భల్లుగూడ విద్యార్థినులతోపాటు, గన్నెల, లోతేరు, బస్కి పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. వీరిలో గన్నెల బాలికల పాఠశాలలోని టెన్త్ విద్యార్థినులకు కొత్త భల్లుగూడ హాస్టల్లో వసతి సౌకర్యం కల్పించగా, బస్కి, లోతేరు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మాత్రం అదే గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో రెండు గదులు కేటాయించారు. రెండు పాఠశాలల విద్యార్థులకు రెండు తరగతి గదులు మాత్రమే కేటాయించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. క్లాస్ రూమ్‌లు చిన్నవి కావడం, బెంచీలు ఉండడంతో ఇరుకు గదుల్లోనే బెంచీల మధ్య విద్యార్థులు కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది . కనీసం తిరగడానికి కూడా దారి లేదని వారు వాపోతున్నారు. బస్కి పాఠశాలలకు చెందిన 29 మంది విద్యార్థులకు ఒకే గదిలో పెట్టడంతో వారు పడే అవస్థలు అన్నీఇన్నీకాదు.


పడుకున్న చోటే చదువుకుంటున్న విద్యార్థి


అందరూ ఒకచోట గుమిగూడి చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు

బెంచీలను ఒక మూలకు జరిపి, అందులోనే ఒకవైపు ఒకరిపక్క మరొకరు కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఉండగా, ఇక బెంచీల ఖాళీల్లోనే అవస్థలు పడుతూ పడుకుంటున్నారు. అంతేకాక రెండు పాఠశాలలకు చెందిన 53 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి ఉండడంతో మలమూత్ర విసర్జనతోపాటు స్నానాలకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో సకాలంలో పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్నామని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇలా అవస్థలు పడుతూఉండే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఎలా రాయగలరని తల్లిదండ్రులతోపాటు చూసిన వారంతా ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉంటే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, పరీక్షలు పూర్తయ్యేవరకు వారికి అన్ని సౌకర్యాలను సమకూర్చాలని ప్రభుత్వంతోపాటు రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు పదేపదే పర్యవేక్షణలు, సూచనలు ఆదేశాలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నప్పటికీ, ఇలా అసౌకర్యాల నడుమ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం, ఏడాది పొడుగునా చదివిన దానికి చివర పరీక్షలు రాసే సమయంలో ప్రశాంతత లేకుండా చేయడం సరికాదని, దీని ప్రభావం తప్పకుండా పరీక్షలపై ఉంటుందని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడం, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

గిఫ్ట్ బాక్స్ కాదు.. పెళ్లి శుభలేఖ

- ఆకట్టుకున్న వివాహ వేడుక ఆహ్వానపత్రిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఈ ఫొటోలో కనిపిస్తున్న బాక్స్‌ను చూసి ఇదేదో గిఫ్ట్ బాక్స్ అనుకుంటే పొరపాటే. ఇది పెళ్లి శుభలేఖ. దీనిని మొదట చూసిన వారు గిఫ్ట్ బాక్సే అనుకున్నారు. కాని తెరిచి చూస్తే అందులో అబ్బుర పరిచే పెళ్లి శుభలేఖ ఉంది. రాజమండ్రిలోని ప్రముఖ ఫైనాన్స్ వ్యాపారి కుమారుడు వివాహానికి సంబంధించిన ఈ శుభలేఖ బాక్స్ గురువారం రాజవొమ్మంగిలోని బైక్ ఫైనాన్స్ యాజమానికి అందజేశారు. తొలిత దీనిని గిఫ్ట్ బాక్స్ అని చాలామంది ఊహించారు. బాక్సుని తెరిచి చూడగా అందులో రెండో సీసాలలో స్నాక్స్, డ్రై ఫ్రూట్స్, చిల్డ్రెన్ చాక్లెట్స్, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటి మధ్య ఇంగ్లీషు, తెలుగు అక్షరాలతో పెళ్లి శుభలేఖ ముద్రించి ఉంది. బాక్స్ రూపంలో ఉన్న ఈ పెళ్లి శుభలేఖని చూసి చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు.





గిఫ్ట్ బాక్స్ రూపంలో ఉన్న ఆహ్వానపత్రిక